# శివాలి

**తండుకూరి శ్రీరాములు**

**ఈ శంకుస్థాపన ఉత్సవం రాజారావుకు తప్ప ఊళ్లో వాళ్లెవ్వరికీ ఇష్టం లేదు. ఊరికి చాలా దూరంలో స్కూలు నిర్మించాలని నిశ్చయించడమే అందుకు కారణం. రాజారావు ఆ ఊరికి సర్పంచే కాదు ధన బలం కల వాడు కూడాను.**

వరండాలో ఎవరో పిలుస్తున్నట్టు విని పించి వడగ్గదిలో ఉన్న రాజారావు బయటకు వచ్చాడు. వచ్చిన వాళ్లను చూడగానే గుర్తొచ్చింది. ఆ ఊరి స్కూలు శంకుస్థాపన అన్న సంగతి.

వచ్చిన వాళ్లను కూర్చోమని చెప్పి ఓ కుర్చీలో తనూ కూర్చున్నాడు సర్పంచ్ రాజారావు.

వెంకటరెడ్డిని ఉద్దేశించి "అన్ని పనులు పూర్తయినట్టేనా?" అని ప్రశ్నించాడు రాజారావు.

కాలేదన్నట్టుగా తల అడ్డం తిప్పాడు వెంకటరెడ్డి ఏం చెప్పాలో తోచక. వెంకటరెడ్డి ఆ ఊరికి ఉప సర్పంచ్.

ఊరికి చాలా దూరంగా స్కూలు నిర్మించ వద్దని, దగ్గరగా ఉన్నట్లయితే చిన్న పిల్లలకు సౌకర్యంగా ఉంటుందన్న ప్రజల విన్నపాన్ని వివరించాడు వెంకటరెడ్డి.

"అది కాదు రెడ్డీ! దూరంగా ఉంటేనే స్కూల్ వాతావరణం బాగుంటుంది. పిల్లలూ ఆరోగ్యంగా ఉంటారు" అన్నాడు రాజారావు ఇన్నాళ్లు లేని పిల్లల మీద ప్రేమ ఆ రోజే పుట్టినట్టు.

"అది కాదు సర్పంచ్ సాబ్ ! స్కూల్ ఊరికి దూరం ఉండటం వల్ల ఎండాకాలం గాని, వానాకాలంగాని బడి పిల్లలు ఇబ్బందులు పడతారు. చిన్న పిల్లలకైతే మరీ కష్టం" అంటూ వచ్చిన వాళ్లలో ఏ మోతుబరి మనిషి సాగదీశాడు.

"ప్రస్తుతం ఊరి మధ్యలో ఉన్న స్కూలు ఎలా నడుస్తుందో చూశారా? దగ్గరే ఉండటం వల్ల బడి పిల్లలు గంట గంటకు ఇంటికి వస్తున్నారని మొన్ననే కదా ఫిర్యాదు చేశారు తల్లిదండ్రులు. అలా అయితే వాళ్లకు చదువు ఎట్లా అబ్బుతుందయ్యా" అని నచ్చచెప్పాడు రాజారావు.

"బడిపంతుళ్లకు భయంలేక గాని గంట గంటకు పిల్లల్ని ఇంటికి పంపుతారా"— అన్నాడు మోతుబరి మనిషి.

ఇటు తల్లిదండ్రుల ఇబ్బందులూ అటు ఉపాధ్యాయుల బాధలు ఎలా ఉన్నా రాజారావు మాత్రం ఊరికి దూరంలోనే స్కూల్ శంకుస్థాపన జరగడానికి నిర్ణయించాడు.

దీనికి ససేమిరా ఇష్టపడలేదు వచ్చిన వాళ్లు. ఏవేవో గుసగుసలు పోతున్నారు.

ఈ విషయం గ్రహించి "ఏం వెంకటరెడ్డీ! నీ వెనకాల ఏదో చెవులు కొరుక్కుంటున్నారు ఎందుకట ఇంక అనుమానం? మన అందరి పిల్లల చదువుల కోసమే కదా స్కూలును నిర్మించాలనుకుంటున్నాం" అన్నాడు రాజారావు వాళ్లనుద్దేశిస్తూ.

"మీ పిల్లల్ని ఊరికి అంత దూరంలో కాబోతున్న స్కూలుకు ఎందుకు పంపుతారులే. పట్నానికో, నగరానికో పంపుతారు. ఎటొచ్చి మాలాంటి వాళ్ల పిల్లలకే కదా బాధలు" అంటూ ఉన్న అనుమానాన్ని వెళ్లగక్కాడు అందులోంచి ఒకతను, అందరి అభిప్రాయం కూడా ఇదే అన్నట్టు.

"ఆఁ! పట్నం ఎందుకు పంపుతాను మన ఊళ్లో స్కూల్ ఉండగ" అన్నాడు రాజారావు. అన్నాడే కాని రాజారావు మనసు నాలుగేళ్ల తన గారాల కొడుకు మీదికి మళ్లింది.

ఎన్నాళ్ల నుంచో ఎదురు చూడగా చూడగా ఎట్టకేలకు రాజారావుకు ఓ కొడుకు పుట్టాడు. లంకంత బంగళాలూ బోలెడంత ఆస్తికీ అతనొక్కడే వారసుడు. నిజానికి ఉన్న ఒక్క కొడుకును అంత దూరాన ఉన్న స్కూల్‌కు పంపించడానికి ససేమిరా ఇష్టం లేదు రాజారావుకు, కానీ స్కూల్ స్థలం గుర్తుకు వచ్చింది ఆయనకు. వెంటనే "లేదు నా కొడుకును తప్పకుండా ఆ స్కూలుకే పంపిస్తాను" అని వాళ్లకు మాట ఇచ్చి అక్కడి నుండి పంపించారు.

శంకుస్థాపన జరిగే స్థలం ఎవరిదో కాదు. ఆ ఊరి పూజారిది. ఆ స్థలం గుడికింద ఇనాం భూమిగా కేటాయించారు. పూజారి ఆస్తిపాస్తులు ఆ భూమే, ఉన్న ఒక్క ఎకరం స్థలం కొత్తగా నిర్మింపబోయే స్కూల్ శంకుస్థాపనకు నోచుకుంది. రేపోమాపో ఎమ్మెల్యే అక్కడ ప్రారంభోత్సవ కార్యక్రమం జరగడానికే సర్వసన్నాహాలు పూర్తయ్యాయి.

గుడి మీద దమ్మిడి ఆదాయం లేకున్నా పాడుపడిన గుడిని బాగుచేసుకుని తాతల నాటి వారసత్వాన్ని నిలబెట్టుకుంటున్నాడు గుడి పూజారి.

రోజూ దేవుడికి నైవేద్యం పెడుతూ ఇనాం భూమిలో పండిన పంటతో పొట్టపోసుకుంటున్నాడు. పాడువడిన ఆ గుళ్లో దేవుణ్ణి దర్శించుకోవడానికి చాలా మంది వెనుకాడుతుంటారు. దర్శనం కోసం వచ్చిన వాళ్లు కొందరు తీర్థప్రసాదాలు తీసుకున్నా దక్షిణ మాత్రం చెల్లించరు. చాటుమాటున కొబ్బరి కాయలు కొట్టుకుని పూజారి హక్కు బాపతు సగం వక్క కూడా మిగల్చకుండా తీసుకెళ్తారు. 'గుడి కింద ఎకరం ఇనాం ఉంది కదా అంతకంటే ఇంకేం' అన్నట్టుగా ఉంటుంది వాళ్ల వైఖరి.

తన జీవనోపాధి అయిన ఇనాం భూమిలో స్కూలు నిర్మిస్తారని ఓ భక్తుడు చెప్పిన పిడుగులాంటి వార్త విన్న పూజారికి గుండె పగిలినంత పనయింది. వెంటనే బయల్దేరాడు ఊరి యజమానింటికి.

తడబడుతున్న కాళ్లతో సర్పంచ్ రాజారావు దగ్గరికెళ్లాడు పూజారి.

"దొరా! నన్నూ నా పిల్లల్ని అడుక్కుతినే వాళ్లని చేయకు". రాజారావు కాళ్లవేళ్ల బతిమిలాడాడు పూజారి. వీల్ చెయిర్‌లో ఠీవిగా కూర్చున్న రాజారావులో మాత్రం ఉలుకూ లేదు పలుకులేదు. కాళ్ల మీద పడబోయాడు పూజారి. మాట వరసకు వింటున్న రాజారావు తన కాళ్లను ఒక్కసారే పైకి లాక్కున్నాడు. చేతులు జోడించి దండం పెట్టడానికి వంగిన పూజారి తల నేలను ఢీకొంది. అప్పటికీ దయ కలగలేదు రాజారావుకు. పడిపోయిన పూజారిని పైకి లేపనైనా లేపలేదు. పూజారే కుర్చీ పట్టుకుని పైకి లేచి మళ్లీ ప్రాధేయపడటం మొదలెట్టాడు బొప్పి కట్టిన తన నుదురును నిమురుకుంటూ.

పూజారితో నోరువిప్పకుంటే మరీ బాగుందదనుకున్నాడేమో "పూజారీ! ఇందులో నా ప్రమేయం ఏమీలేదు నాకేం తెలియదు". అమాయకత్వం నటిస్తూ అన్నాడు రాజారావు. ఈ మాటలు విన్న పూజారి బిత్తరపోయాడు.

"మొన్న మనూరొచ్చిన ఎమ్మెల్యే స్కూల్ శంకుస్థాపన ఊరికి దూరాన ఉన్న ఆ స్థలంలోనే చేయాలని నిర్ణయించాడట" అంటూ తాను చేసిందేమిలేనట్టు తనకు ఏమీ తెలియనట్టు మోహం పెట్టి పలికాడు రాజారావు. ఇంక అక్కడ చేయగల్గిందేమీ లేక కళ్లు

తుడుచుకుంటూ బయటపడ్డాడు పూజారి.

* * *

రాజారావుకు లంకంత ఇల్లేకాదు సముద్ర మంత భూమీ ఉంది. ఆ భూమి ఒకే చోట కాకుండా అక్కడ కొంత మరో చోట కొంత ఉంది. ఊరికి దగ్గర్లోనూ భూమి ఉంది. మొదట స్కూలును ఊరికి దగ్గరలో అన్ని వసతులు కలిగి ఉన్న రాజారావు స్థలంలోనే నిర్మించడానికి నిర్ణయించారు ఊరు ప్రజలు. పిల్లల తల్లిదండ్రులు కూడా ఎంతో సంతోషించారు. ఊరికి దగ్గరగా ఉంది కాబట్టి. కాని ప్రజల ఊహలు తారుమారయ్యాయి. ఇంక కొన్నాళ్లయితే శంకుస్థాపన అవుతుందనగా స్కూలు నిర్మాణం అనుకోకుండా మార్పు. రాజారావు స్థలంలో పాతాల్సిన శంకుస్థాపన రాయి పూజారి గుండెల్లో పాతారు. ఆ రాయి కాస్త ఇప్పుడు పెరిగి పెద్దదై నాలుగు గదుల స్కూలు భవనమైంది. పూజారికది గుండె మీది విషవృక్షంలా దర్శనమిస్తుంది.

ఊరికి స్కూలు దూరమున్నా బడి పిల్లలు రోజూ వెళ్తూనే ఉన్నారు. ఇచ్చిన మాట నిల బెట్టుకోవాలనుకున్నాడేమో తన గారాల పుత్రరత్నాన్ని కొత్త స్కూలుకు పంపిస్తున్నాడు రాజారావు.

ఇదిలా ఉండగా గుండె మీద పడిన కొండంత భారాన్ని అలాగే మోస్తూ ఊరిలో రోజూ భిక్షం అడుగుకుంటూ బతుకుతున్నాడు పూజారి తన కుటుంబంతో సహా. రాజారావు అయిదేళ్ల కొడుకు అక్షర శ్రీకారానికి పిలిచినా వెళ్లలేదు పూజారి, ఎవరిచేత అక్షర శ్రీకారం పిలిచినా వెళ్లలేదు పూజారి. ఎవరిచేత అక్షర శ్రీకారం చేయించారో తెలియదుగాని వాడికి ఒక్క అక్షరం ముక్క రావటం లేదు. పైగా వాడిని బాగా గారాబం చేయటం వల్ల సోమరిపోతూ, నిద్దుర మొద్దూ అయ్యాడు. ఒకే కొడుకు గదా! రోజూ బుజ్జగిస్తూ బాగా తిండిపెట్టి బతిమిలాడి మరీ బడికి పంపేది వాళ్లమ్మ.

విజయ దశమినాడు పుట్టడం వల్ల వానికి విజయరావు అని పేరు పెట్టారు. విజయ దశమికి వాడి పుట్టిన రోజు పండగ దసరా పండుగతో పాటు ఘనంగా జరుపుకుంటారు. అయిదుదాటి ఆరో ఏడులో అడుగుపెట్టబోతున్నాడు విజయరావు, ప్రతి ఏడు చేసినట్టే ఈ సంవత్సరం కూడా పుట్టిన రోజు పండగ ఘనంగా చేయడానికి ఇష్టపడ్డారు తల్లిదండ్రులు.

రేపటి నుండి బడి పిల్లలకు దసరా సెలవులు. విజయరావు పుట్టిన రోజు ఇంకెన్నాళ్లోలేదు. ఈ సంబరంలో మునిగినట్టున్నారు రాజారావు ఆయన భార్య. ఆ రోజు స్థానిక ఎమ్మెల్యే పిలుపు మేరకు భార్యకు చెప్పి పట్టణానికి ప్రయాణం కట్టాడు సర్పంచ్ రాజారావు. ఆనాడు బడి వదిలి ఎంత సేపైందీ గమనించలేదు వాళ్లమ్మ. పిల్లలంతా ఎవరి



ఏమయ్యా! సుబ్బారావు మీ అబ్బాయితో అవసరం లేని పుస్తకాలు కూడా మోయిస్తూ స్కూల్‌కు పంపుతున్నావు ఎందుకు అని అడిగాడు రామనాథం పంతులు.

వాడు పెద్దవాడు అయిన తర్వాత ఎలాగూ ఉద్యోగం రాదని ఊహించి అలా చేస్తున్నానండి అన్నాడు చాకలి సుబ్బారావు.

గుడివాడ అప్పలనాయుడు
భూపతిపాలెం

ఇళ్లకు వాళ్లు వచ్చేశారు. విజయరావు ఎంత సేపటికీ రాకపోయేసరికి ఊరంతా వెతికిచ్చినా లాభం లేకపోయింది.

చాలా పొద్దుపోయి వచ్చిన రాజారావు విషయం తెలుసుకుని పిచ్చివాడైనట్టు కేకలేశాడు. ఊరంతా తిరిగి వెతికించాడు. లాభం లేకపోయింది. రాజారావు పిచ్చి కాస్తా కోపంగా మారింది. ఆ కోపం పూజారి మీద పడింది. వెంటనే పూజారిని పిలుచుకురండని ఆర్డర్ జారీ చేశాడు పనివాళ్ళతో. వెతికి వెతికి ఎట్టకేలకు పూజారిని పట్టుకువచ్చారు వాళ్ళు.

"పూజారీ! నా కొడుకును ఎక్కడ దాచావో చెప్పు!" కోపాన్ని దిగమింగిన రాజారావు ప్రాధేయపడ్డాడు.

"సర్పంచ్‌గారూ! నాకేం తెలియదు. మీ పిల్లవాణ్ణి నేను చూడలేదు" పూజారి దైన్యంగా చెప్పాడు.

"లేదు. నా కొడుకును నీవే దాచావు. నిజం చెప్పు ఎక్కడున్నాడో" రాజారావు కోపం తెచ్చుకున్నాడు.

రాజారావు కోపాన్ని చూసి గడగడా వణికిపోతూ —"నిజమే చెబుతున్నాను సర్పంచ్‌గారూ! నాకేం తెలియదు" ఏడ్చినంత పని చేశాడు పూజారి.

"మర్యాదగా నిజం చెబుతావా, లేక పోలీసులకు అప్పగించమంటావా?" రాజారావు బెదిరించాడు.

మరేం మాట్లాడలేకపోయాడు పూజారి ఏం చేయాలో తోచక. ఓపిక నశించిన రాజారావు చేతికందిన ములుగర్రతో పడీల్ పడీల్ మని రెండు దెబ్బలు వేశాడు. లబోదిబోమన్నాడు పూజారి. ఈ అరుపులకు అందరూ పోగయ్యారు.

"వీడే ఎత్తుకుపోయినట్టున్నాడు దొరా, నీ కొడుకుని. కొట్టండి, బాగా కొట్టండి వాడే చెబుతాడు" గుంపులోని ఓ కంఠం సెలవిచ్చింది.

"రాజారావుగారూ! అసలు విషయం పూర్తిగా బయటపడాలంటే పూజారిని పోలీసులకు పట్టిస్తే సరి. తెలుస్తుంది" ఆ గుంపులో నుండే ఇంకొకరి సలహా.

ఈ సలహా అందరికీ నచ్చినట్టుంది. పోలీసుల్ని పిలిపించాడు. రాజారావు దగ్గర డబ్బెంత తీసుకున్నారో తెలియదు గానీ, పూజారిని లాక్కెళ్ళారు పోలీసులు.

పోలీస్‌స్టేషన్లో పూజారిని చిత్రహింసలు పెడుతూనే ఉన్నారు పోలీసులు. కానీ అసలు విషయం తేలటంలేదు.

కొడుకు కనిపించకపోవడంతో రాజారావు, ఆయన భార్య దిగాలుపడిపోయి బిక్కుబిక్కుమంటున్నారు. రాజారావు భార్య కంటికి మంటికి ఏకధారగా ఏడుస్తూనే ఉంది.

ఇలా మూడు రోజులు గడిచాయి. ఎందుకనో ఊరికి దూరాన ఉన్న స్కూలు పక్క నుండి వెళ్తున్న ఉపసర్పంచ్ వెంకటరెడ్డికి హఠాత్తుగా దుర్గంధం రావడంతో అనుమానం వేసి కొత్తగా స్కూల్‌కేసి నడిచాడు. వాసన మరికాస్త ఎక్కువైంది. దగ్గరికి వెళ్ళి చూశాడు. బడికి తాళాలు వేసి ఉన్నాయి. ఇంకా కొన్ని రోజులైతేగానీ స్కూల్ తెరవరు. అనుమానం ధృవపడింది. వెంటనే కొందరిని పిలిచి విషయమంతా వివరించి గది తాళం పగులగొట్టించాడు. గది తెరవగానే ఓ మూల రాజారావు కొడుకు శవం కనిపించింది. ఎవరి నిర్లక్ష్యం వల్లనో గాని పసిబాలుని ప్రాణం బలైపోయింది.

రేపటినుండి దసరా సెలవులనగా ఆనాడు ఆఖరు పీరియడ్‌లో స్కూల్లోనే నిదురపోయిన రాజారావు కొడుకును సెలవుల తొందరపాటులో అటు స్కూల్ ప్యూన్ గానీ, ఇటు ఉపాధ్యాయులు గానీ గమనించలేదు. నిదురపోయిన ఆ బాబును చూడకుండానే తాళాలు వేసుకుని ఎవరి ఊళ్ళకి వారు వెళ్ళిపోయారు. స్కూల్‌కు వాచ్‌మెన్ లేకపోవటమూ, ఉన్న ప్యూన్ పట్టించుకోకపోవటమూ —ఇంత ఘోరం జరిగిపోయింది. స్కూలు ఊరికి చాలా దూరంగా ఉండటం వల్ల ఎప్పటికో రాత్రికి మెలకువ వచ్చిన ఆ బాబు ఎంత ఏడ్చినా ఎవ్వరికీ వినబడలేదు. ఏడ్చీ ఏడ్చీ భయానికి స్పృహ తప్పిపడిపోయాడు ఆ బాబు.

స్కూలుకు తెల్లవారి నుండి సెలవులు కాబట్టి స్కూల్ తెరవలేదు. స్కూల్‌లోనే ఆ బాబు చిక్కిపోయినట్టు ఎవ్వరూ ఊహించలేదు. ఇలా ఇంత హృదయ విదారకంగా ఈ బాబు నేల కొరిగిన సంగతి ఆ ఊరి ప్రజలకు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు తెలియనప్పుడు చిత్రహింసలకు గురై పోలీస్ లాకప్‌లో బందీ అయి మరణించిన పూజారికేం తెలుసు పాపం!